epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 60 | శనివారం | 29.06.2024



# ధర్మపురి శ్రీనివాస్ ఇకలేరు

## గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన మాజీ మంత్రి

- కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్
- సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

2



3

వరంగల్‌కు

## సీఎం రేవంత్

- నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- టెక్స్ టైల్ పార్క్, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పరిశీలన

పాఠం చెప్పిన

## కడియం

- స్టేషన్‌ఘన్‌పూర్ కస్తూర్బా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- స్టూడెంట్లకు క్లాస్ తీసుకున్న ఎమ్మెల్యే శ్రీహరి
- విద్యా ప్రమాణాలు పెంచాలని అధికారులకు ఆదేశాలు



3

మన చౌరాస్తా
2
29.06.2024 శనివారం
epaper.manachourasta.com



# డీఎస్ ఇకలేరు

- గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన మాజీ మంత్రి
- కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్
- సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబీకులు తెలిపారు. డి.శ్రీనివాస్ ఉమ్మడి ఏపీలో మంత్రిగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. డి శ్రీనివాస్ మరణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు సంతాపాన్ని తెలియజేశారు.

## డీఎస్ ప్రస్థానం..

డీఎస్ 1948 సెప్టెంబర్ 27న జన్మించారు.. ఆయన నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. విద్యార్థి సంఘం నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ నుంచి తొలి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. 1998లో ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. సోనియా గాంధీకి విధేయునిగా గుర్తింపు తెచ్చుకున్నారు.. ప్రణబ్ ముఖర్జీ, తదితర సీనియర్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జైపాల్ రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, 2009లో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డీఎస్ మంత్రిగా పనిచేశారు. అలాగే పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం దక్కింది. 2013 నుంచి 2015 శాసనమండలి సభ్యునిగా కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం శాసనమండలి విపక్ష నేతగా ఉన్నారు.. అయితే రెండో సారి ఎమ్మెల్సీగా అవకాశం రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2015లో బీఆర్ఎస్‌లో చేరిన డీఎస్.. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. డి శ్రీనివాస్ చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు.. పెద్దకుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు.



# అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**ములుగు, మన చౌరాస్తా :** అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలోరూ. కోటి 29 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, కార్యాలయ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సొసైటీ చైర్మన్ తోట రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 20 సంవత్సరాల కింద నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమయంలో ఏక కాలంలో లక్ష రూపాయల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌ది అన్నారు. అదే విధంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేడు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసినప్పటికీ 2 లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వచ్చే ఆగస్టు నాటికీ రాష్ట్రంలోని రైతాంగానికి ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

## టూరిజం అభివృద్ధికి కృషి..

జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. జిల్లాలోని రామప్ప, లక్నవరం, మల్లూరు గుట్ట, బొగత జలపాతం తదితర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు టూరిజంలో పార్ట్ టైం ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలను సాధించుకునే విధంగా జాబ్ మేళాలతో 700 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. త్వరలో మరో జాబ్ మేళా ఏర్పాటు చేసి ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని, మండల కేంద్రంలో కూడా మహిళలకు అమ్మ చేతి వంట ప్రజలకు అందేలా క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ కాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్ రావు, సీఈవో వజీర్ సుల్తాన్, డీసీవో సర్దార్ సింగ్, నోడల్ అధికారి హరిత, ములుగు బ్యాంక్ మేనేజర్ సంపత్, జిల్లా సహకార డైరెక్టర్లు మాడుగుల రమేశ్, ఎర్రబెల్లి గోపాల్ రావు, జిల్లాలోని మండలాల చైర్మన్లు కూనూరు అశోక్ పాల్గొన్నారు.



# స్పోర్ట్స్ సిటీగా హనుమకొండ

- క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్

**హనుమకొండ, మన చౌరాస్తా :** స్వల్ప వ్యవధిలోనే గణనీయమైన ప్రగతిని సాధిస్తూ హనుమకొండ స్పోర్ట్స్ సిటీగా మారుతోందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ఎ. వాణి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధితో పాటు క్రీడా పాఠశాల ఎంపికలను పర్యవేక్షించారు. తొలుత స్టేడియంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ను పరిశీలించారు. 'కుడా' ఆధ్వర్యంలో గ్రాస్ నిర్మాణంతోపాటు నగర మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ట్రాక్ మధ్యలో నూతనంగా రెజ్లింగ్ హాల్ నిర్మిస్తుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. కొత్త భవన నిర్మాణం ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని డివైఎస్ ఓ అశోక్ కోరారు. నాటి కమిషనర్ నేటి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. అనంతరం స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాల ఎంపికల నిర్వహణ తీరును పరిశీలించారు. దీనిలో భాగంగా 800 మీటర్ల పరుగు పందెంను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. మెరుగైన ప్రతిభ కనబరిచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడా పాఠశాలలకు ఎంపికవాలన్నారు. తదనంతరం బస్టాండ్ సమీపంలో ఉన్న యువజన శాఖ నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కంప్యూటర్ , టైలరింగ్ శిక్షణార్థులతో శిక్షణ కార్యక్రమ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే విశేష అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి గుగులోతు అశోక్ కుమార్ ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్ మహ్మద్ నయిమ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు బి. కైలాస్ యాదవ్, తోట శ్యాం ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.



## సీపీని కలిసిన వెస్ట్ జోన్ డీసీపీ

**జనగామ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వెస్ట్ జోన్ నూతన డీసీపీగా బాధ్యతలు చెపట్టిన రాజమహేంద్ర నాయక్ శుక్రవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మార్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు వెస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు ఇతర విషయాలపై చర్చించుకున్నారు.



# విద్యా ప్రమాణాలు పెంచాలి

- ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** విద్యా ప్రమాణాలు పెంచి ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకం కలిగించాలని ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటుంది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సరైన సదుపాయాలు లేక, సరిపడా భవనాలు వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తగ్గుతున్నాయి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవిలలో అన్ని రకాల సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యా ప్రమాణాలు బాగుంటాయనే నమ్మకాన్ని తీసుకురావాలి ఆదేశించారు. ఇటీవల జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని రకాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, నోడల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించామని చెప్పారు. ఈ ఏడాది ఒక క్యాలెండర్ ఏర్పాటు చేసి కనీస వసతుల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి ఆదేశాలు ఇచ్చారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించాలి. అలాగే దేవాదుల ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు, ప్రతీ గ్రామానికి త్రాగు నీరు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. ఈ కార్యక్రమంలో డిఈఓ రాము, ఆర్డీఓ వెంకన్న, ఏసిపి భీమ్ శర్మ, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, ఎంపీడివో ఉమాదేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# నేడు ఓరుగల్లుకు సీఎం

- నగర అభివృద్ధిపై సమీక్ష

**వరంగల్, మన చౌరాస్తా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు వరంగల్‌లో పర్యటించనున్నారు. సీఎం టూర్ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ టూర్ షెడ్యూల్ ఇలా ఉంది. మధ్యాన్నం 12:40 గంటలకు సీఎం హైదరాబాద్ నుంచి బయలుదేరి... మధ్యాన్నం 1: 30 గంటలకు వరంగల్ చేరుకుంటారు. టెక్స్ టైల్ పార్క్, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పరిశీలిస్తారు. మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభిస్తారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సమీక్షిస్తారు. ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించి తిరిగి హైదరాబాద్ కు తిరుగు పయనం అవుతారు.



# పరిపాలనా దక్షుడు పీవీ

## హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ, మన చౌరాస్తా :** భారత రత్న, మాజీ ప్రధాని పీవీ గొప్ప పరిపాలన దక్షుడు అని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహా రావు జయంతి సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీవీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన వారని, ఆయన జయంతి సందర్భంగా అందరూ ఇక్కడకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. వరంగల్ లో జన్మించి దేశ దశాదిశా మార్చిన మహా నాయకుడు పీవీ నరసింహారావు అని అన్నారు. అంతకు ముందు పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### జనగామ డీసీసీ భవన్‌లో..

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తొలి తెలుగు ప్రధాని, ఆర్థిక సంస్కరణ వేత్త, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, జనగామ మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికి ఇందిరా, జనగామ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, కౌన్సిలర్లు జక్కుల అనిత, గాదపాక రామచంద్రం, బొట్ల శ్రీనివాస్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, బడికే కిష్టస్వామి, జక్కుల వేణుమాధవ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జాఫర్ షరీఫ్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మేకల సమ్మయ్య, నాయకులు మిద్దెపాక స్టాలిన్, నోముల సోమయ్య, ఉల్లంగుల మధు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు వేమళ్ల పద్మ, సుమతీ తదితరులు పాల్గొన్నారు.





## వెబ్ సిరీస్‌లోకి..
# నేహా శర్మ

**మన చౌరాస్తా, సినిమా :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా పరిచయమైన చిరుత సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది నేహా శర్మ. తొలి చిత్రంతోనే ఈ బ్యూటీకి భీభత్సమైన ఫాలోయింగ్ వచ్చేసింది. ఈ మూవీ తర్వాత వరుణ్ సందేశ్ సరసన కుర్రాడు సినిమాతో మరోసారి అలరించింది. కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బోల్తా పడడంతో నేహాకు అవకాశాలు అంతగా రాలేదు. దీంతో తిరిగి బాలీవుడ్ షిఫ్ట్ అయినా నేహా శర్మ.. అక్కడే వరుస సినిమాలు చేస్తుంది. చాలా కాలం తర్వాత ఇప్పుడు మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు రాబోతుంది నేహా.. కానీ ఈసారి సినిమా కాదు.. వెబ్ సిరీస్. ఓటీటీ ప్లాట్ ఫామ్ ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించేందుకు రెడీ అయ్యింది. నేహా శర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఓ మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్ త్వరలోనే అడియన్స్ ముందుకు రాబోతుంది. 30 డేస్ అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుంది. జూలై 12 నుంచి ఈ సిరీస్ ఓటీటీలో సినీ ప్రియుల ముందుకు రాబోతుందని సోనీ లివ్ అఫీషియల్ గా ప్రకటించింది. 36 డేస్ కు సంబంధించిన అన్ని సీక్రెట్స్ ఆరోజు రివీల్ అవుతాయని వెల్లడించింది. ఇందులో నేహా శర్మతో పాటు పూరబ్ కోహ్లి, శ్రుతి సేఠ్, చందన్ రాయ్ సన్యాల్, షరీబ్ హష్మి, అమృతా ఖాన్విల్కర్ కీలకపాత్రలో నటించగా.. హాలీవుడ్ విమర్శలు అందుకున్న బోల్డ్ వెబ్ సిరీస్ 36 డేస్ ఆధారంగా ఈ సిరీస్ రూపొందించారు. దీనికి డైరెక్టర్ విశాల్ ఫ్యూరియా దర్శకత్వం వహించారు. మొత్తం ఎనిమిది ఎపిసోడ్స్ తో ఈ సిరీస్ రూపొందనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఎపిసోడ్ 40 నిమిషాల నుంచి 50 నిమిషాల నిడివితో ఉంటాయని తెలుస్తోంది. అలాగే హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాలం, బెంగాళీ భాషలతో పాటు మరిన్ని భాషల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతున్నట్లు సమాచారం. ఇక ఇటీవల విడుదలైన 36 డేస్ ట్రైలర్ ఆకట్టుకుంది. ఇందులో మరోసారి నేహా శర్మ అందాల ఆరబోత, గ్లామర్ లుక్స్ లో మెస్మరైజ్ చేసేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది.